సాక్షి అనంతపురం

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.1°/09.6°

జిల్లాలో బుధవారం రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఉదయం పూట చాలా మండలాల్లో చలితీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

శేషవాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు



తాడిపత్రి టౌన్: బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం ఉదయం వాసుకీ వాహనం, రాత్రి శేషవాహనాలపై పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి తాడిపత్రి పుర వీధుల్లో ఊరేగారు. ఆలయం నుంచి గాంధీ కట్ట, గానుగవీధి, పోలీస్ స్టేషన్ రోడ్డు, సీబీ రోడ్డు, అశోక్ పిల్లర్, మెయిన్ బజార్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆంజనేయులు, కమిటీ సభ్యులు అంబటి రాఘవేంద్రారెడ్డి, హరిప్రసాద్, భగీరథమ్మ, ప్రధాన అర్చకులు, శంకరశర్మ, గిరిశర్మ, నందు శర్మ, మహేష్ స్వామి, శివమాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీజన్ చివర్లో చలిగింతలు

- ఉదయం చలి, మధ్యాహ్నం ఎండలు

అనంపురం అగ్రికల్చర్: సీజన్ చివర్లో చలి తీవ్రత పెరిగింది. మూడు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో మరోసారి శీతల వాతావరణం నెలకొంది. ప్రధానంగా ఉదయం చలితీవ్రత కొనసాగుతుండగా.. మధ్యాహ్న సమయంలో ఎండ ప్రతాపం చూపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం మరోసారి అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు కావడం విశేషం. అగళిలో 8.4 డిగ్రీలు, బెళుగుప్పలో 9.6 డిగ్రీల కనిష్టం నమోదైంది. మిగతా మండలాల విషయానికి వస్తే... శెట్టూరు 10.3 డిగ్రీలు, మడకశిర 10.5, రొద్దం, కుందుర్పి, గుమ్మఘట్ట 10.7, విడపనకల్లు, కనగానపల్లి 10.9, కణేకల్లు 11.2, కంబదూరు, గుడిబండ 11.3, రాయదుర్గం, సోమందేపల్లి 11.4, కొత్తచెరువు 11.7, కళ్యాణదుర్గం, తనకల్లు 11.8 డిగ్రీలు... ఇలా చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. మిగతా మండలాల్లో 12 నుంచి 18 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రతల విషయానికి వస్తే 10 నుంచి 12 మండలాల్లో 35 నుంచి 37 డిగ్రీలు ఉండగా, మిగతా ప్రాంతల్లో 32 నుంచి 35 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

ఆదివారం నుంచి పశువుల సంత

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ ఆదివారం నుంచి పశువుల సంత నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీజెస్–ఎల్ఎస్‌డీ) వ్యాప్తి చెందడంతో ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాలతో పశుసంవర్ధకశాఖ సూచన మేరకు గతేడాది సెప్టెంబర్ 18 నుంచి పశువుల సంతను బంద్ చేసినట్లు పేర్కొన్నారు. అంటు వ్యాధి కావడంతో వ్యాప్తి చెందకుండా పశువుల సంత బంద్ చేయడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో పశువుల రవాణాను తగ్గించామని గుర్తు చేశారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల సంత నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టడం, రైతులు, వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి ప్రతి ఆదివారం గతంలో మాదిరిగానే పశువుల సంత నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. సరిగ్గా ఐదు నెలల పాటు బంద్ తర్వాత పశువుల సంత ఆదివారం నిర్వహిస్తున్నందున వినియోగించుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు వ్యాపార లావాదేవీలు, పశువుల రవాణా చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీలో డీజిల్ దందా



- కర్ణాటక నుంచి ఇంధనం సరఫరా
- వ్యాపారులతో కుమ్మక్కైన అధికారులు
- గుంతకల్లు డిపోలో వెలుగు చూసిన అక్రమాలు
- వ్యాట్ రూపంలో ఏపీ ప్రభుత్వానికి భారీగా గండి

ఆర్టీసీలో డీజిల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కాసుల కోసం ఆర్టీసీ అధికారులు ఇంధన వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. నిబంధనలు ఉల్లంఘించారు. సమీపం నుంచి కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి ఇంధనం తెప్పించారు. ధర తక్కువని.. అక్కడ కొనుగోలు చేసిన వ్యాపారులు.. స్థానికంగా తీసుకొచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచుకుని.. ఏపీ ప్రభుత్వానికి వ్యాట్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. మూడు రోజుల క్రితం గుంతకల్లు ఆర్టీసీ డిపోలో వెలుగుచూసిన డీజిల్ అక్రమాలే ఇందుకు నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా ఇలాగే జరుగుతోందని తెలుస్తోంది.

గుంతకల్లు టౌన్: ఆర్టీసీ డిపోలకు గత ఏడాది ఫిబ్రవరి వరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) డిపోల నుంచి డీజిల్ సరఫరా చేసే వారు. మార్కెట్ ధర కంటే డిస్కౌంట్‌కు ఇచ్చే రిటైల్ బంక్‌ల (డీలర్ కమీషన్ తగ్గించుకుని ఇచ్చే వారి) నుంచి కొనుగోలు చేసి.. డీజిల్‌పై వెచ్చిస్తున్న ఖర్చును ఆదా చేయాలని ప్రభుత్వం సూచించింది. దీన్నే అదునుగా భావించిన అనంతపురానికి చెందిన వ్యాపారులు ఆర్టీసీ అధికారులతో కుమ్మక్కయ్యారు. తమకు అనుకూలంగా ఉన్న డిపోల సమీపంలోని రెండు లేదా మూడు ఔట్‌లెట్ నిర్వాహకుల నుంచి కొటేషన్లు తీసుకుని ఎక్కువ డిస్కౌంట్ ఇచ్చే వారికి కాంట్రాక్ట్ ఇస్తున్నట్లు పేపర్ల మీద చూపిస్తూ.. వారి బ్యాంకు ఖాతాలకే డీజిల్ బిల్లులను జమచేస్తారు. కానీ కాంట్రాక్ట్ దక్కించుకున్న ఔట్‌లెట్‌ల నుంచి కాకుండా కర్ణాటక నుంచి డీజిల్‌ను తెప్పించుకుని లీటర్‌పై మిగిలే రూ.7.50ను అక్రమార్కులు, అధికారులు కలిసి పంచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. డీజిల్ సరఫరా చేయకపోయినా కేవలం తన ఔట్‌లెట్ పేరును వాడుకుంటున్నందుకు సదరు ఔట్‌లెట్ యజమాని బిల్లుకింత చొప్పున పర్సంటేజీ తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

మతలబు ఇదే..

మన జిల్లాలో ప్రస్తుతం లీటర్ డీజిల్ రూ.99.20కు రిటైల్ బంక్‌ల యజమానులు విక్రయిస్తున్నారు. అదే కర్ణాటకలో లీటర్ డీజిల్ ధర రూ.89.42 ఉంది. రిటైల్ డీలర్‌కు లీటర్ డీజిల్‌పై రూ.2.20 (ఐఓసీ), రూ.1.98 (హెచ్‌పీసీ) కమీషన్ వస్తుంది. ఒక వేళ నెలకు అధిక మొత్తంలో డీజిల్ విక్రయించినా పైసల్లోనే కమీషన్ పెరుగుతుంది. మరి ఆర్టీసీ డిపోలకు సరఫరా చేస్తున్న రిటైల్ డీలర్ రూ.2.45 డిస్కౌంట్ ఇస్తున్నారు. ఇదేంటి ఇక్కడి రిటైల్ డీలర్లు నష్టాలను భరిస్తూ డిపోలకు డీజిల్ విక్రయిస్తున్నారనుకుంటే పప్పులో కాలిసినట్లే. కర్ణాటకలో డీజిల్ ధర తక్కువగా ఉండటం డీజిల్ మాఫియాకు కలిసొస్తోంది.

- ఉదాహరణకు గుంతకల్లు డిపో అధికారులు డీజిల్ సరఫరా చేసే ఔట్‌లెట్ నుంచి కొటేషన్లు కోరారు. గార్లదిన్నెకు చెందిన మణికంఠ ఔట్‌లెట్ వారు మార్కెట్‌లో ఉన్న డీజిల్ ధర రూ.99.20 కన్నా రూ.2.45 డిస్కౌంట్‌తో రూ.96.75కే లీటర్ డీజిల్‌ను గుంతకల్లు డిపోకు సరఫరా చేస్తామని టెండర్ దక్కించుకున్నారు. ఒక లీటర్ అమ్మితే డీలర్‌కు రూ.2.20 వస్తుంది. ఈ రకంగా పోల్చినా లీటర్‌పై 25 పైసలు నష్టాన్ని భరిస్తున్నారు. అంటే 12 వేల లీటర్లకు రూ.3 వేలు, డీజిల్‌ను రానూ పోనూ 120 కి.మీ దూరంలో ఉన్న గుంతకల్లు డిపోకు రవాణా చేయడానికి ట్యాంకర్‌కు 24 లీటర్ల డీజిల్ అవసరమైతే.. ఇందుకు సుమారు రూ.2,400 ఖర్చవుతుంది. డ్రైవర్, క్లీనర్‌ల బత్తా రూ.800 దాకా వెచ్చించాల్సి ఉంది. అంటే గార్లదిన్నె నుంచి గుంతకల్లు డిపోకు ఒక లోడ్ డీజిల్‌ను సరఫరా చేయాలంటే ఔట్‌లెట్ యజమానికి రూ.6,200 దాకా ఖర్చవుతుంది. గుంతకల్లు డిపో నెలకు 1.30 లక్షల లీటర్ల డీజిల్‌ను కొనుగోలు చేస్తుంది. సుమారు నెలకు 11 లోడ్‌లు అవుతాయి. అంటే నెలకు సదరు ఔట్‌లెట్ యజమాని రూ.68,200 నష్టాన్ని భరించి ఆర్టీసీకి డీజిల్ సరఫరా చేస్తున్నారంటేనే ఇందులో జరుగుతున్న గూడుపుఠాణి ఏంటో ప్రజలకు అర్థమవుతుంది. కర్ణాటక డీజిల్‌ను డిపోలకు సరఫరా చేయడం ద్వారా అక్రమార్కులతో పాటు వారికి సహకరిస్తున్న అధికారులు ప్రతి నెలా లక్షలాది రూపాయలు మెక్కుతూ ఏపీ ప్రభుత్వానికి వ్యాట్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు.

నకిలీ ఇన్‌వాయిస్‌తో డీజిల్ సరఫరా..

గుంతకల్లు ఆర్టీసీ డిపోలో కర్ణాటక డీజిల్‌ను అక్రమంగా తరలించారన్న విశ్వసనీయ సమాచారంతో రెవెన్యూ అధికారులు ఈ నెల 11న దాడులు నిర్వహించారు. సరైన రికార్డులు లేకపోవడంతో 12 వేల లీటర్ల డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. సమీపంలోని గార్లదిన్నె ఔట్‌లెట్ నుంచి కాకుండా రానుపోనూ 440 కి.మీ దూరంలో గల శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని శ్రీషిర్డీసాయి ఫిల్లింగ్‌స్టేషన్ నుంచి ఈ డీజిల్‌ను ట్యాంకర్ ద్వారా ఎందుకు రప్పించారనే విషయమై అధికారులు విచారించగా వాస్తవాలు వెలుగుచూశాయి. ట్యాంకర్ డ్రైవర్ నుంచి డిపోలో స్వాధీనం చేసుకున్న ఇన్‌వాయిస్ ప్రతుల ప్రకారం అందులో శ్రీషిర్డీసాయి ఫిల్లింగ్ స్టేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఔట్‌లెట్ అని ఉంది. కానీ సదరు షిర్డీసాయి పేరిట ఐఓసీఎల్ ఔట్‌లెట్ అక్కడ లేదని, ఆ ఔట్‌లెట్ హెచ్‌పీసీఎల్ సంస్థకు చెందినదని గుర్తించారు. ఈ విషయమై ఐఓసీఎల్ సేల్స్ ఆఫీసర్ విష్ణుతేజను అధికారులు వివరణ కోరగా శ్రీషిర్డీసాయి ఫిల్లింగ్ స్టేషన్ హెచ్‌పీసీఎల్ ఔట్‌లెట్ అని, ఐఓసీకి సంబంధం లేదని చెప్పారు. వేబిల్లులో ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా సదరు వ్యక్తి స్పందించట్లేదని, అందువల్ల వాట్సాప్‌కు నోటీసులు పంపామని డీసీటీఓ కృష్ణవేణి తెలిపారు. పూర్తి నివేదికను తహసీల్దార్ ద్వారా జాయింట్ కలెక్టర్‌కు పంపినట్లు ఆమె వెల్లడించారు.

ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేంద్రుడు, చిత్రంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం సిటీ: ఎస్‌ఐ ఉద్యోగాలకు ఈ నెల 19న నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు ఎస్పీ నాగేంద్రుడు ఆదేశించారు. ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మొబైల్స్, ఇతర డిజిటల్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని స్పష్టం చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా పర్యవేక్షణ పెట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పరీక్ష ప్రశాంతంగా సాగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నేడు కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఖాళీగా ఉన్న ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ల ఉద్యోగాల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. అర్హులైన వారి మెరిట్ జాబితాను జిల్లా వెబ్‌సైట్ httpr://ananatha puramu.ap.gov.in లో ఉంచామని పేర్కొన్నారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్

- ఇదే రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- నామినేషన్ల దాఖలుకు 23 వరకు అవకాశం
- 24న పరిశీలన.. 27 వరకు ఉపసంహరణ
- మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు



నామినేషన్ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేసుకుంటున్న డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పాటు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఎనికల నోటిఫికేషన్‌ను గురువారం ఉదయం 9 గంటలకు ఇన్‌చార్జ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ విడుదల చేస్తారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్ల దాఖలుకు ఈనెల 23 ఆఖరు. 24వ తేదీన పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ ఆఖరు. మార్చి 13న ఎన్నికలు, 16న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

సర్వం సిద్ధం..

నామినేషన్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. అభ్యర్థులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, పత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహంచేందుకు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాట్లు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి గాయత్రీదేవి పర్యవేక్షణలో ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు ఈ ప్రక్రియ నిర్వర్తిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఆర్‌ఓ వద్ద దాఖలు చేయాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా అర్హతలు, సూచనలు, నిబంధనలను జారీ చేసింది

అర్హతలు:

- అభ్యర్థి భారత దేశ పౌరుడై ఉండాలి.
- ఇదే రాష్ట్రంలో ఏదేని నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- గతంలో ఎన్నికల కమిషన్ చేత అనర్హులుగా గుర్తింపబడి ఉండకూడదు.
- ఎన్నికల్లో పోటీ చేసేందుకు వయసు 30 ఏళ్లు.. ఆపై ఉండాలి.

సూచనలు:

- అభ్యర్థి ఫారం 2–ఇలో నామినేషన్ దాఖలు చేయాలి.
- రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం–ఎ, ఫారం–బి సమర్పించాలి. (వీటిని నామినేషన్ చివరి రోజులోగా ఇవ్వొచ్చు)
- అభ్యర్థి స్వయంగా లేదా ప్రతిపాదితుని ద్వారానైనా నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టాంప్ సైజ్ ఫొటోల వెనుకవైపున అభ్యర్థి సంతకం చేయాలి
- 10 మంది ప్రతిపాదితులు సంతకం చేయాలి (పట్టభద్ర ఎమ్మెల్సీకి పట్టభద్ర ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఉపాధ్యాయ ఓటర్లు)

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ



పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నట్లు కలెక్టర్ (ఎఫ్ఏసీ), రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ వెల్లడించారు. ఈ నెల 23 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. ఈనెల 18, 19 తేదీలు ప్రభుత్వ సెలవు దినాలు అయినందున నామినేషన్లు స్వీకరించబోరని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో పాటు ముగ్గురు వ్యక్తులను రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు అనుమతిస్తారని చెప్పారు.

- నామినేషన్‌కు ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు డిపాజిట్ (కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి), ఇతరులు రూ.10వేలు డిపాజిట్ చేయాలి. ట్రెజరీలో చలనా రూపంలో లేదా నగదు చూపంలో చెల్లించాలి.
- ఫారం 26 అఫిడవిట్‌లో అన్ని గడులూ పూరించాలి. ప్రతి పేజీలో నోటరీ, అభ్యర్థి సంతకం చేయాలి.
- ప్రమాణ పత్రం ఇవ్వాలి.

నిబంధనలు:

- నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో పాటు ముగ్గురిని ఆర్‌ఓ చాంబర్‌లోకి అనుమతిస్తారు.
- ఆర్‌ఓ కార్యాలయం నుంచి 100 మీటర్లలోపు వరకు ఇతరులను అనుమతించరు.
- ఆర్‌ఓ కార్యాలయం గేటు వరకు మూడు వాహనాలను అనుమతిస్తారు. అక్కడి నుంచి చాంబర్‌కు నడిచి వెళ్లాలి.

జంట హత్యల మిస్టరీ వీడేనా..?

- సీసీ కెమెరాల్లో నిందితుల కదలికలు నిక్షిప్తం
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

గుంతకల్లు: గుంతకల్లులో ప్రముఖ భూస్వామి జీపీ హేమకోటిరెడ్డి మంగళవారం తన ఇంట్లోనే దారుణహత్యకు గురయ్యారు. అడ్డుకోబోయిన ఆయన డ్రైవర్‌నూ దుండగులు కత్తితో పొడిచి చంపారు. హత్యకు దారి తీసిన కారణాలు ఇంకా తెలియరాలేదు. అనుమానితుల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిందితుల కోసం పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. త్వరలోనే కేసు మిస్టరీ వీడే అవకాశం కనిపిస్తోంది. గుంతకల్లు పుర ప్రముఖుల్లో హేమకోటిరెడ్డి ఒకరు. ఈయన ఇటీవలే అమెరికా నుంచి వచ్చారు. మంగళవారం సాయంత్రం రెడ్డితో పని ఉందంటూ ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి వచ్చి కత్తులతో విరుచుకుపడ్డారు. తొలుత కోటిరెడ్డిని, ఆ తర్వాత డ్రైవర్‌ను కత్తితో పొడిచి చంపిన అనంతరం ఇంటి పని మనిషి, డ్రైవర్ తల్లి అయిన వహిదాపై దాడికి యత్నించి, సీసీ టీవీ ఫుటేజీని ఎత్తుకుని వెళ్లిపోయారు. పోలీసులు దీన్ని హైప్రొఫైల్ కేసుగా పరిగణించి.. నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. స్వయంగా ఎస్పీ ఫక్కీరప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కోటిరెడ్డి ఇంటిలోని సీసీ ఫుటేజీ లేకపోయినా.. ఇంటి బయట షాపులకు అమర్చిన సీసీ టీవీలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు రికార్డవడాన్ని పోలీసులు గుర్తించారు. సోషల్ మీడి యాలో సైతం అనుమానాస్పద వ్యక్తుల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేస్తున్నారు.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న అనుమానాస్పద వ్యక్తుల ఫొటో

నేడు కోటిరెడ్డి అంత్యక్రియలు

అమెరికా నుంచి కోటిరెడ్డి కుటుంబ సభ్యులు గురువారం గుంతకల్లుకు చేరుకోనున్నారు. అదే రోజు అంత్యక్రియలు పూర్తి చేయనున్నారు. పోస్టుమార్టం పూర్తి చేసి కోటిరెడ్డి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కట్టుదిట్టంగా ఇంటర్మీడియెట్ పరీక్ష

అనంతపురం: ఇంటర్ విద్యార్థులకు 'ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్' పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు ఆర్ఐఓ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 28,324 మందికి గాను 27,660 మంది పరీక్షలు రాశారన్నారు. 664 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఒకేషనల్ కోర్సులో మొత్తం 2,376 మందికి గాను 2,185 మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. 191 మంది గైర్హాజరయ్యారన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పరీక్షల సమయంలో టీచర్లు సెలవు పెట్టరాదు
- బైజూస్ యాప్ వంద శాతం వినియోగించాలి
- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి : డీఈఓ



మోడల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ

గార్లదిన్నె: ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈఓ సాయిరాం హెచ్చరించారు. గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను డీఈఓ బుధవారం తనిఖీ చేశారు. పలురికార్డులు, ఉపాధ్యాయులు డైరీ, పరీక్షల పత్రాలు దిద్దిన విధానాన్ని పరిశీలించారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదన్నారు. అత్యవసర సమయంలో మాత్రమే సెలవులు వినియోగించుకోవాల న్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బైజూస్ యాప్‌ను వందశాతం ఉపయోగించే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మోడల్ స్కూల్లో వంద శాతం బైజూస్ యాప్ వినియోగించిన ముగ్గురు విద్యార్థులను డీఈఓ అభినందించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిని పద్మప్రియ, మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రనాయక్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంలకు షోకాజ్

అనంతపురం: ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు వినియోగించడంలో వెనుకబడినట్లు గుర్తించిన డీఈఓ ఎం.సాయిరాం ఇద్దరు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డీఈఓ బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న నెహ్రూ మునిసిపల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసిన కొందరు ఉపాధ్యాయులు విధుల్లో కనిపించలేదు. బయటకెళ్లిన ఉపాధ్యాయులు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గార్లదిన్నె మండలం కల్లూరు ఉన్నతపాఠశాలనూ డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బైజూస్ ట్యాబ్స్ వినియోగంలో విద్యార్థులు పూర్తిగా వెనుకబడినట్లు స్పష్టమైంది. దీంతో అనంతపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కిరణ్మయి, కల్లూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ నారాయణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు



మహాభోగ్ నిర్వహిస్తున్న దృశ్యం



సేవాలాల్ మహారాజ్ మూల విరాట్



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న 108 మంది కన్యలు

గుత్తి రూరల్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంత్యుత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు రోజులపాటు చెర్లోపల్లి పంచాయతీ సేవాగడ్‌లోని సేవాలాల్ ఆలయం బంజారాలతో కిటకిటలాడింది. చివరిరోజు ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం స్వామికి సుప్రభాతం, పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్‌కు కుంభాభిషేకం జరిపించారు. ఉత్సవ విగ్రహాన్ని తోలారం గుర్రంపై ఊరేగించారు. సేవాలాల్ మాలధారుల ఇరుముడులు సమర్పించారు. ఆలయం ఎదుట ఉన్న హోమం కట్టపై మహాభోగ్ (హోమం) నిర్వహించారు. 108 మంది కన్యలు మావలి జగదాంబ ఆలయం వరకు కలశాలతో ఊరేగింపుగా వచ్చి కుంభాభిషేకం జరిపించారు. పలువురు భక్తులు సేవాలాల్ మహారాజ్‌కు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం ప్రాకారోత్సవంతో సేవాలాల్ జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలు విజయవంతం అయిన సందర్భంగా ట్రస్టు సభ్యులు నృత్యాలు చేసి తల్వార్‌తో విన్యాసాలు చేశారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు శేఖర్‌నాయక్, సుబ్రమణ్యం నాయక్, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోకు నిప్పు



రాప్తాడు రూరల్: అనంతపురం మండలం విద్యారణ్యనగర్‌లో ఓ ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు... విద్యారణ్యనగర్‌లోని ఉర్దూ స్కూల్ సమీపంలో మల్లికార్జున, ఉమాదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. ఆటో డ్రైవర్‌గా మల్లికార్జున పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం సాయంత్రం బాడుగలు చూసుకుని రాత్రికి ఇంటి ఎదుట ఆటో నిలిపి, నిద్రపోయాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆటోలో మంటలు వ్యాపించాయి. పొరుగింటి వారు గుర్తించి వెంటనే మల్లికార్జునను అప్రమత్తం చేసి, మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆటో పూర్తిగా కాలి పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనకు ఆకతాయిలు పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ విజయభాస్కరగౌడ్ తెలిపారు.

స్టోర్ డీలర్ల నియామక ప్రక్రియ నిలుపుదల

అనంతపురం రూరల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్టోర్ డీలర్ల నియామక ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా నిలిపి వేశారు. ఈ మేరకు ఆర్డీఓ మధుసూదన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న స్టోర్ డీలర్ల నియామక ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు.

19న జిల్లా స్థాయి చెస్ పోటీలు

కదిరి అర్బన్: జిల్లా స్థాయి అండర్-7 విభాగం బాలికల ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 19న కదిరిలోని ఎన్జీఓ కాలనీలో ఉన్న సిసిరా ప్లే స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నీ ఇన్‌చార్జ్ నాగార్జున కర్ణాటకమ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2016, జనవరి 1 బాలికలు ఈ పోటీలకు అర్హులు. రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. టోర్నీలో ప్రతిభ చాటుకున్న వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. మరింత సమాచారానికి 95812 50684లో సంప్రదించవచ్చు.

ఎస్పీఎల్ విజేత తిరుపతి

- జూనియర్ విభాగంలో ఇడుపులపాయ జట్టు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు



జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్ధన



సీనియర్ విభాగంలో విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి ప్రీమియర్ లీగ్' రీజనల్ స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ పోటీల విజేతగా తిరుపతి సీకాం జట్టు, జూనియర్స్ విభాగంలో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు నిలిచాయి. 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన అనంత క్రీడాగ్రామం వేదికగా రెండు రోజుల పాటు సాగిన ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. బుధవారం ఆర్డీటీ ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఫైనల్స్‌లో సీనియర్ విభాగంలో సీకాం జట్టు (తిరుపతి) ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు (ప్రొద్దుటూరు), జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ (వైఎస్సార్), సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్లు తలపడ్డాయి.

ధరణి మెరుపు బ్యాటింగ్

- సీనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి) జట్టుపై ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులకు పరిమితమైంది. జట్టులో విజయ్ 25 బంతుల్లో 2 ఫోర్లతో 30 పరుగులు, మరో బ్యాటర్ శివకేశవ 16 బంతుల్లో 1 సిక్సర్‌తో 20 పరుగులు సాధించారు. సీకాం బౌలర్లలో శశాంక్ 2, సుబ్బు 1 వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 7.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయసంగా ఛేదించింది. జట్టులో ధరణి మెరుపు బ్యాటింగ్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. మొత్తం 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52 పరుగులు సాధించాడు. ఎస్‌కేఎస్‌సీ బౌలర్లలో వెంకటేష్ 1 వికెట్ దక్కించుకున్నాడు. 8 వికెట్ల తేడాతో తిరుపతి సీకాం జట్టు విజయ కేతనం ఎగురవేసి, త్వరలో విజయవాడ వేదికగా సాగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

రీజనల్ స్థాయి మ్యాచ్‌లో చెలరేగిన ట్రిపుల్ ఐటీ

- అనంత క్రీడాగ్రామంలోని హాకీ మైదానం వేదికగా బుధవారం ఉదయం నిర్వహించిన జూనియర్స్ విభాగం రీజనల్ మ్యాచ్‌లో ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు - అనంతపురం జిల్లా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆత్మకూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇడుపులపాయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో చేతన్ 23 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 60 పరుగులు, రాంబాబు 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగులు సాధించారు. ఆత్మకూరు బౌలర్లలో మనోజ్, జయ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్ల వద్ద 60 పరుగులకే కుప్పకూలింది. జట్టులో వెంకట్ ఒంటరి పోరు సాగిస్తూ 12 బంతుల్లో 6 ఫోర్లతో 25 పరుగులు సాధించాడు. ఇడుపులపాయ బౌలర్లలో ప్రకాష్, హర్ష, చరణ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. 81 పరుగులతో ఇడుపులపాయ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

ఉత్కంఠ రేపిన 'జూనియర్స్'

- ఆర్డీటీ ప్రధాన క్రీడామైదానంలో నిర్వహించిన జూనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్టుపై టాస్ గెలిచి ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా) జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో ప్రకాష్ 12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 34 పరుగులు, మరో బ్యాటర్ రాంబాబు 25 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 26 పరుగులు సాధించారు. తిరుపతి బౌలర్లలో గౌతం 3, ముఖేష్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. చివరి ఆరు బంతుల్లో 20 పరుగులు సాధించాల్సి ఉండగా క్రీజ్‌లో హర్ష, బాలాజీ ఉన్నారు. తొలి బంతిని బ్యాటర్ బౌండరీ దాటించడంతో ట్రిపుల్ ఐటీ క్రీడాకారులు ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో రెండో బంతిని బౌలర్ డాట్ చేశాడు. మూడో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో తిరిగి ఉత్కంఠ నెలకొంది. ఇక మిగిలిన మూడు బంతుల్లో పది పరుగులు సాధించాల్సి ఉండడంతో ఇరు జట్ల క్రీడాకారులతో పాటు చూస్తున్నప్రేక్షకులు సైతం ఊపిరిబిగబట్టారు. నాల్గో బంతిని బౌలర్ వైడ్ వేయడంతో తిరుపతి క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి. ఐదో బంతికి బ్యాటర్ సింగిల్ రన్ చేశాడు. మిగిలిన చివరి రెండు బంతుల్లో ఎనిమిది పరుగులు సాధించాల్సి ఉంది. ఆరో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో ఒక్కసారిగా తిరుపతి క్రీడాకారులు కేరింతలు కొట్టారు. విజయం తమదేనన్న ధీమా అందరిలోనూ వ్యక్తమైంది. అయితే ట్రిపుల్ ఐటీ బౌలర్ ఏడో బంతిని చాకచక్యంగా డాట్ చేయడంతో ఊహించని విధంగా విజయం ట్రిపుల్ ఐటీ వశమైంది. ఒక్క పరుగు తేడాతో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

ఓటమి గెలుపునకు తొలిమెట్టు

ఏ క్రీడలోనైనా ఓటమి అనేది తర్వాత సాధించే గెలుపునకు తొలి మెట్టుగా ఉపయోగపడుతుందని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింక రంగజనార్దన అన్నారు. ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. గెలుపు ఆనందాన్ని అందిస్తే ఓటమి భవిష్యత్తుపై ఆశలు రేపుతుందన్నారు. ప్రతి క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ చక్కటి అవకాశాన్ని ఇచ్చిన 'సాక్షి' మీడియా గ్రూపును అభినందించారు. రైవర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు తొలి మెట్టుగా దోహదపడుతుందని అన్నారు. రాయలసీమ స్థాయి టోర్నీ నిర్వహణకు సహకరించిన ఆర్డీటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జూనియర్ విభాగంలో రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు



సీనియర్ విభాగంలో రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న ప్రొద్దుటూరు ఎస్ఆర్ఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు

అవగాహనతోనే తెగుళ్ల నివారణ సాధ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

బుక్కరాయసముద్రం: తెగుళ్లపై అవగాహన ఉన్నప్పుడే వాటి నివారణ సాధ్యమవుతుందని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. బీకేఎస్ మండలం చెన్నంపల్లిలో బుధవారం నిర్వహించిన క్లస్టర్ స్థాయి పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచన మేరకే పురుగు మందుల పిచికారీ చేయాలన్నారు. రబీ వేరుశనగ సాగులో లద్దె పురుగు ఎక్కువగా ఉందని కిలో బెల్లం పానకానికి 10 కిలోల వరి తవుడు, మోనోక్రోటోఫాస్ 200 ఎంఎల్ కలిపి రాత్రి సమయంలో ఉండలుగా చేసి పొలం చివర, మధ్యలో ఉంచి ఉదయం తీసి వేయాలన్నారు. పొలం చుట్టూ నాలుగు సాళ్లు జొన్న, సజ్జ, మొక్క జొన్న పంటలను ఎర పంటగా వేసుకోవాలని సూచించారు. అంతర పంటగా ఖరీఫ్‌లో కంది, రబీలో అలసంద సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యాం సుందరరెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



స్వామి శేషవస్త్రాలను అందుకుంటున్న డాక్టర్ లక్ష్మణ్

గుత్తి రూరల్: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని యువతకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. గుత్తి మండలం సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ చింతన ద్వారా ఏదైనా సాధించవచ్చునని నిరూపించిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీజేపీదే

అనంతపురం టవర్‌క్లాక్: రాబోవు ఎన్నికల్లో తెలంగాణాలో ఎలాంటి పొత్తులు లేకుండా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక రుద్రంపేట బైపాస్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో అప్పర్ భద్రా ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఆంధ్రకు ఎలాంటి నష్టమూ లేదన్నారు. నీటి కేటాయింపులు యథాతథంగానే ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, నాయకులు లలిత్‌కుమార్, రత్నమయ్య, సోమయ్య, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

పుట్టపర్తి అర్బన్: విధి నిర్వహణలో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొవాలంటే మానసిక ఒత్తిడిని జయించాలని పోలీసు సిబ్బందికి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, యోగా మాస్టర్ రాఘవేంద్రరాజు సూచించారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై స్పెషల్ పార్టీ పోలీసులు, పీఎస్‌ఓలకు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పోలీసులు విధులు నిర్వర్తించే సమయంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. దీంతో మానసిక ప్రశాంత కరువై తప్పిదాలకు తావిచ్చినట్లవుతుందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు యోగా ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. దీని వల్ల మానసిక ఒత్తిడి తగ్గడమే కాక దీర్ఘకాలిక జబ్బులూ నియంత్రణలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సెక్యూరిటీ వింగ్ ఆర్ఐ నారాయణ, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీలోని రూ.లక్ష అపహరణ

ధర్మవరం అర్బన్: స్కూటీ డిక్కీలో ఉంచిన రూ.లక్ష నగదును దుండగులు అపహరించారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లోనికోటకు చెందిన అమన్ అనే వ్యక్తి బస్టాండ్ సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హౌసింగ్ లోను తీసుకున్నాడు. బ్యాంకు లోన్ కట్టేందుకు బుధవారం తన స్కూటీ డిక్కీలో రూ.లక్ష నగదు పెట్టుకుని బ్యాంకు వద్దకు వచ్చాడు. డబ్బు డిక్కీలోనే ఉంచి వివరాలు కనుక్కొనేందుకు బ్యాంకులోనికి వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చి చూడగా డిక్కీ ఓపెన్ అయి ఉండటంతో పాటు అందులోని రూ.లక్ష కనిపించలేదు. దీంతో అమన్ వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అనంతరం బ్యాంకు కింద ఉన్న ఎంఆర్‌ఎఫ్ టైర్ల షాపులోని సీసీ కెమెరా పరిశీలించగా, దొంగలు స్కూటీ డిక్కీ ఓపెన్ చేసి అందులోని రూ.లక్ష ఎత్తుకెళ్లే దృశ్యాలు కనిపించాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు.

అత్యాచారయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

కదిరి అర్బన్: మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కదిరి సీఐ సూర్యనారాయణ వెల్లడించారు. చిలమత్తూరు మండలం కోటపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ కొంత కాలంగా కదిరి పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 14న మగ్గాల క్వాటర్స్ నుంచి కదిరికి వచ్చేందుకు ఆటో ఎక్కిన ఆమెను కదిరి మండలం యర్రదొడ్డి సమీపంలోకి చేరుకోగానే ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్ (కదిరిలోని నిజాంవలీ కాలనీ నివాసి), మోహియార్ నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ ఆమెను ముళ్లపొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న కొందరు వారి చర్యలను అడ్డుకుని మహిళను కాపాడారు. లక్ష్మీనారాయణ పారిపోగా రాజ్‌కుమార్‌ను పట్టుకుని అదే రోజు కదిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుడు లక్ష్మీనారాయణను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి, నిందితులిద్దరినీ న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అభ్యసనా సామర్థ్యాల అభివృద్ధిపై తనిఖీ




డెమోక్లాస్‌లో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుల బృందం

హిందూపురం: విద్యాభివృద్ధిలో భాగంగా ముద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత, బాలికోన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభ్యసన సామర్థ్యాల అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం రాష్ట్ర పరిశీలకుల బృందం తనిఖీ చేసింది. రికార్డుల నిర్వహణ, డైరీలు, పాఠ్య ప్రణాళిక తయారీ తదితర అంశాలను బృందం సభ్యులు నాగేంద్రరెడ్డి, విజయ్‌కుమార్ పరిశీలించారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళిక బద్ధంగా అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. అలాగే చిలమత్తూరు మండలం జెడ్పీఉన్నత పాఠశాలను ఎల్ఐపీ బృందం సభ్యులు విజయకుమార్, నాగేంద్రరెడ్డి, రామలింగను తనిఖీ చేశారు. 6, 8వ తరగతిలకు సంబంధించిన పాఠ్యాంశాల బోధనపై డెమోలను పరిశీలించారు.

యువకుడి దుర్మరణం

రొళ్ల(అగళి): ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అగళి మండలం కదిరేపల్లికి చెందిన మోహన్ (29), వడగుంటనహళ్లికి చెందిన భూతరాజు ఇద్దరూ బుధవారం రాత్రి 9 గంటలకు ద్విచక్ర వాహనంపై కర్ణాటకలోని శిరాకు బయలుదేరారు. హుల్లేకెర గ్రామ సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై మలుపు వద్ద శిరా నుంచి అగళి వైపు వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎడమ కాలు విరిగిన భూతరాజును స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా శిరా లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై అగళి ఎస్ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీ.. ఫ్లైఓవర్ నుంచి కిందపడి ద్విచక్రవాహనదారుడి మృతి



రక్తపు మడుగులో రామకృష్ణ మృతదేహం

అనంతపురం సిటీ: కారు డ్రైవర్ అతి వేగం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని సోమనాథనగర్‌కు చెందిన మంత్రాల రామకృష్ణ (36)కు భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టాటాఏస్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం తన సొంత పనిపై ద్విచక్రవాహనంపై బయలుదేరిన అతను 44వ జాతీయ రహదారిపై కళ్యాణదుర్గం ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనతో ఒక్కసారిగా గాలిలోకి లేచిన రామకృష్ణ తలకిందులుగా ఫ్లైఓవర్ పై నుంచి కిందపడ్డాడు. తల బద్ధలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి స్థానికులు వెంటనే కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. ట్రాఫిక్ ఎస్ఐ రంగస్వామి అక్కడు చేరకుని పరిశీలించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కిషోర్ ఇకలేరు



అనంతపురం కల్చరల్: సీనియర్ జర్నలిస్టుగా, కవిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తికెక్కిన వంగిపురం రఘు కిషోర్ (67) ఇక లేరు. విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి పత్రికల్లో సుదీర్ఘకాలం జర్నలిస్టుగా పనిచేసిన ఆయన బుధవారం అనారోగ్యంతో తన స్వగృహంలో కన్నుమూశారు. ఇటీవలే తన 67వ జన్మదినాన్ని బంధువులదరి మధ్య జరుపుకున్న ఆయన నగరంలోని ప్రశాంతి నగర్‌లో జీవించేవారు. వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన వంగీపురం వేంకట శేషాచార్యులు, అలివేలు మంగమ్మ దంపతులకు ఏడుగురు సంతానమైతే.. కిషోర్ చివరివాడు. 1956 ఫిబ్రవరి 12న జన్మించారు. ఆయన కుటుంబం 1975లో అనంతపురానికి వచ్చి స్థిరపడ్డారు. తండ్రి స్వతహాగా మంచి కవి కావడంతో ఆ ప్రభావం ఆయనపై కూడా పడి తెలుగుభాష పట్ల మక్కువ పెంచుకున్నారు. విద్యార్థి దశ నుండే ఏఐఎస్ఎఫ్‌లో చేరి ఆర్టిస్టుగా కొద్ది కాలం పనిచేశారు. సీనియర్ జర్నలిస్టుగా ఓ వైపు పత్రికలకు విశేష సేవలందిస్తూనే అనేక కథలు, కవితలు రాశారు. సినిమా పరిశ్రమలో సైతం తన ప్రతిభను చాటుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. మల్లెమాల తరపున వెళ్లి ఐదేళ్ల పాటు గంగాధర్ అనే కళాదర్శకుని వద్ద ఆర్టిస్టుగా పనిచేశారు. సినిమా టైటిళ్లు, బొమ్మలు గీశారు. జిల్లా రచయితలకు, రచయితల సంఘానికి సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో అనారోగ్యం బారిన పడిన కిషోర్ బుధవారం సాయంత్రం తన నివాసంలో అస్వస్థతకు గురై కన్నుమూశారు. గురువారం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయన మృతి పట్ల పలు జర్నలిస్టు సంఘాల నేతలు, స్నేహితులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

గర్భిణుల నమోదు పక్కాగా చేపట్టండి

పెనుకొండ: గర్భిణుల నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టడంతో పాటు వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గర్భిణుల నమోదు తర్వాత ప్రతి నెలా వారికి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన సూచనలు, సలహాలివ్వాలన్నారు. ప్రసవం అనంతరం ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడంతో పాటు శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25 లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

ఆత్మకూరు: పంట నమోదు చేసుకున్న రైతులు ఈనెల 25లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పప్పుశనగకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.5,335 నిర్ణయించారని, పంట నమోదు, ఈ-కేవైసీ పూర్తయిన వారి పంట మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ఏఈఓ విజయ్‌కుమార్, సుజిత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

రాప్తాడు: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం రాప్తాడులో ఉపాధ్యాయ ఏపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బాల కదిరప్ప, నాయకులు వెంకటరాముడు, ఆదినారాయణ రెడ్డి, నరసింహులు, రామకృష్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

రాప్తాడు: విద్యార్థులు పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని డైట్ కళాశాల సైకాలజిస్ట్ సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో పరీక్షా పర్వ్ 4.0పై టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా రామకృష్ణా రెడ్డి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా న్యామద్దల రామకృష్ణారెడ్డిని నియమించినట్లు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా

అనంతపురం సప్తగిరి సర్కిల్: విజయవాడ వేదికగా నిర్వహించిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో, బాలుర విభాగంలో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బాలికల విభాగంలో సాయి జ్యోతిక, పల్లవి, సల్మా, బాలుర విభాగంలో ఆంటోని, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. వీరిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు అభినందించారు.

ఘనంగా వార్షికోత్సవం

రాప్తాడు: స్థానిక బీసీ కాలనీలో నాగులకట్ట దగ్గర ఉన్న షిర్డీసాయి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ కాలనీ వాసులు ఆలయం వద్ద ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు.

వాహనం బోల్తా

ఆత్మకూరు: పంపనూరు సమీపంలో వడ్డుపల్లి మిట్ట వద్ద బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గానికి చెందిన బొలెరో వాహనం లగేజీతో రాయదుర్గం నుంచి అనంతపురం బయలుదేరింది. వడ్డుపల్లి మిట్ట వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. వాహనంలో ఇద్దరు వ్యక్తులకు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు వాహనాన్ని తాళ్లతో పైకి లేపారు.

ఆధ్యాత్మికతతో ఆరోగ్యం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికత సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుందని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో 3 రోజులుగా తపోవనంలోని జగదీశ్వరాలయంలో జరుగుతున్న శతసహస్ర పార్థివ లింగార్చన బుధవారం ఘనంగా ముగిసింది. వాసంతి సాహిత్యతో పాటు చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, మణూరు నాగరాజు, నిర్వాహకులు సాయిట్రస్టు విజయసాయికుమార్ ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. పార్థివ లింగాలకు ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతితో సహస్రార్చనను ముగించారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువకేంద్ర, జన జాగృతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'నేచర్ అండ్ హ్యుమానిటీ' అనే అంశంపై బుధవారం జరిగిన వక్తృత్వ పోటీలలో యువతీయువకులు మెప్పించారు. ఆచార్య రవిప్రసాద్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జీఎల్ఎన్ ప్రసాద్, ఆచార్య శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ప్రణతి, ఎస్వైకే డీడీఓ శ్రీనివాసులు, వెంకటేష్ ఆత్మీయ అతిథులుగా ప్రసంగించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలనందించారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ప్రజలకు ఎంతో మేలు చేశాం



హాజరైన వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో ఎంపీ రంగయ్య, ఎన్నికల పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్ తదితరులు

- ఇంటింటా వివరించండి
- జగనన్నను మళ్లీ సీఎంని చేసుకుందాం
- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మూడున్నరేళ్లలోనే ప్రజలకు ఎంతో మేలు చేశామని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి చేసిన మంచిని వివరించాలని పిలుపునిచ్చారు. స్థానిక వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం 'నువ్వే మా నమ్మకం జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు, పార్టీకి వారథులుగా కన్వీనర్లు, గృహ సారథులు వ్యవహరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ప్రత్యేక నమ్మకం ఉంచుకున్నారన్నారు. నేడు ప్రతిపక్షాలు ప్రజలకు మంచి చేస్తామని కాకుండా ప్రజల మద్దతుతో ఉన్న తమ ప్రభుత్వాన్ని కుట్రలు చేసి కూలదోయడానికి ఏకమవుతున్నాయని మండిపడ్డారు. వారి కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు.

98 శాతం హామీలను పూర్తి చేశాం..

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేసి ప్రజల్లో తనకంటూ సీఎం జగన్ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారన్నారు. ఆయన ఇచ్చిన మాటను వందకు వంద శాతం పూర్తి చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందన్నారు. 2019 ఎన్నికల్లో 79 శాతం ఓటింగ్ జరగగా ప్రస్తుతం తమ ప్రభుత్వం 83 శాతం కుటుంబాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. విద్యా దీవెన, విద్యా కానుక, అమ్మ ఒడి, వసతి దీవెన, ఇంగ్లీష్ మీడియం వంటి వాటిని అమలు చేసి పేద విద్యార్థులను సైతం ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అవినీతి, అక్రమాలు, మధ్యవర్తులు లేకుండా లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలను ప్రజల ఖాతాల్లోకి జమచేశామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, ప్రజా ప్రతినిధుల ఆమోదం లేకపోతే పథకాలు అందేవి కాదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షపార్టీలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాయన్నారు. ప్రజల్లో విషం నింపి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాయన్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో 5 మంది కన్వీనర్లు చింత సోమశేఖరరెడ్డి, చింతకుంట మధు, లక్ష్మణ్ణ, అలమూరు శ్రీనివాసరెడ్డి, ప్రకాష్‌రెడ్డిని నియమించామన్నారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న కిట్‌ను ప్రతి కన్వీనర్, గృహ సారథులకు అందిస్తామని వారు ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి ఈ ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించాలన్నారు. ఎక్కడా అలసత్వం లేకుండా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ నమ్మకానికి మారుపేరు జగన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర డైరెక్టర్లు శ్రీదేవి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, శోభారాణి, మాజీ మేయర్ రాగే పరుశురాం, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, కృష్ణవేణి, చెన్నారెడ్డి బషీర్, మల్లెల వేణుగోపాల్, బీ మదన్‌మోహన్‌రెడ్డి, సాదిక్, కువైట్ ఖాదర్‌బాషా, ఖాదర్, గఫార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ హేమలత అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఇంటి బిల్లులు లబ్దిదారుల ఖాతాలకు వెంటనే జమవుతున్నాయని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తెలియజేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పనులు సద్వినియోగం చేసుకోవాలని, పనులకు సంబంధించి ఏ వారం బిల్లులు ఆ వారంలోనే అందుతున్నాయని ఏపీఓ పుష్ప పేర్కొన్నారు. ఈ క్రాప్, ఈ-కేవైసీ, ఆర్బీకేల పనితీరుపై ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. వేసవి రాబోతుందని నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను కోరారు. ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఈఓఆర్డీ సత్యబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఒడి బియ్యం



మహిళలకు ఒడి బియ్యం పెడుతున్న దృశ్యం

రాప్తాడు: హంపాపురంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చుక్కా సంజీవరాయుడు తన మనుమడు చుక్కా క్రిషిక్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని 120 మంది ఆడపడచులకు ఒడి బియ్యం పెట్టారు. చీర, పసుపు, కుంకుమ పెట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోపుదుర్తి ఆత్మా రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో తన కుమారుడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తోపుదుర్తి మహిళా సహకార డెయిరీని ఏర్పాటు చేస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేసి వేలాది మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకుడు అంజన్ కుమార్ పాల్గొన్నారు.

పరమేశ్వరా పాహిమాం



పార్వతీ సమేత పరమేశ్వరుడి ఊరేగింపు

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. బుధవారం ఆలయంలో కొలువుదీరిన శివపార్వతులకు పంచామృతాభిషేకాలు, రుద్రార్చన, దీక్షా హోమం నిర్వహించారు. రాత్రి సర్వాంగ సుందరంగా అలంకార భూషితుడైన ఆదిదేవుడు సతీసమేతంగా రావణబ్రహ్మ వాహనంపై నగరవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చాడు. గ్రామీణ కళాకారులు శివభజనలతో స్వామివారి ఉత్సవానికి మరింత శోభను తెచ్చారు. నాట్యాచార్యులు భాగ్య శిష్యబృందం కోలాటంతో నాట్య నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధారాణి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివమాలధారుల ఇరుముడి

రాప్తాడు: స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివ స్వాముల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా శివమాలధారులు, భక్తులు ఉదయాన్నే ఆలయంలో ప్రత్యేక అర్చనలు జరిపించారు. గురుస్వామి గవ్వల మల్లిఖార్జున ఆధ్వర్యంలో వారికి ఇరుముడి ధరింపజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు భోజన వసతి కల్పించారు. శివ దీక్ష పూర్తి చేసిన పూర్తి చేసిన 65 మంది శ్రీశైలం బయలుదేరారు. శివమాలధారులకు వీడ్కోలు చెప్పేందుకు వారి కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది. స్వాములు ఇరముడి పురవీధుల్లో ఊరేగింపుగా ముత్యాలమ్మ గుడి వద్దకు చెరుకుని అక్కడ ఇరముడి విప్పి బసులో శ్రీశైలం తరలివెళ్లారు.

మహిళలు అడ్డంకులను అధిగమించాలి



మాట్లాడుతున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహిళలు తమకు ఎదురయ్యే అడ్డంకులను అధిగమించి ముందుకు దూసుకెళ్లాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో స్త్రీ శక్తి ప్రాజెక్టులో భాగంగా 23 మంది మహిళలకు ఉచితంగా ఆటో రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేలా ఆర్డీటీ తోడ్పాటు అందిస్తుందన్నారు. ఆర్డీటీలో పనిచేసే 23 మంది మహిళలను ఎంపిక చేసి 33 రోజుల పాటు ఆటో డ్రైవింగ్‌తో పాటు కరాటే, యోగా, ప్రథమ చికిత్స, రోడ్డు భద్రత నియమాలు, వ్యక్తిత్వ వికాసం, ఆర్థిక లావాదేవీలు, లైంగిక వేధింపులు, ఆటోల్లో తలెత్తే చిన్నపాటి మరమ్మతులపై శిక్షణ అందించామన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ



శిక్షణకు హాజరైన చిన్నారులతో లాలీగా బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని ఫుట్‌బాల్ క్రీడాకారులకు స్పెయిన్‌కు చెందిన లాలీగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆర్డీటీ కేంద్రాల్లో ఉన్న ఏడేళ్లపైబడిన చిన్నారులకు పాసింగ్, కిక్, హోల్డ్‌లో శిక్షణ అందిస్తున్నారు. విద్యకు స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. కార్యక్రమంలో లూజ్ మరియా సాన్జ్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి శివరుద్ర బాలయోగి రాక

అనంతపురం కల్చరల్: ప్రపంచవ్యాప్తంగా శివబాలయోగి ఆశ్రమాలకు పీఠాధిపతి అయిన శివరుద్ర బాలయోగి స్వామీజీ బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. శివబాలయోగి ఆశ్రమంలో స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. శివబాలయోగి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. నిర్వాహకులు వెంకటేష్ గుప్తా, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ గురువారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 'గురుసదన్'ను స్వామీజీ ప్రారంభిస్తారన్నారు. 8వ తరగతి, ఆపై చదువుకునే విద్యార్థులకు పూర్తి ఉచితంగా చదువులందించే బృహత్తర కార్యక్రమాన్ని స్వామీజీ చేతుల మీదుగా ఆరంభమవుతుందన్నారు. ఆశ్రమంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ రెండో వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతాయని, భక్తులు తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

నేటి నుంచి కోడ్ అమలు

అనంతపురం సిటీ: పట్టభద్రుల, ఉపాధ్యాయ, అనంతపురం లోకల్ అథారిటీస్ నియోజకవర్గ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుందని, ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలవుతుందని పేర్కొన్నారు. కోడ్ అమలులోకి రానున్న దృష్ట్యా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎటువంటి ఆందోళనలు, నిరసనలు చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీహెచ్‌సీల ఏర్పాటుపై సమావేశం

అనంతపురం అగ్రికల్చర్: ఆర్‌బీకేలకు అనుబంధంగా కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటుపై రూరల్ మండల వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వరప్రసాద్ సమీక్షించారు. బుధవారం స్థానిక ఏవో కార్యాలయంలో ఏఈవో మురళితో కలిసి ఆర్‌బీకే అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద ఇప్పటికే మొదటి విడత కింద ఏర్పాటు చేసిన సీహెచ్‌సీల ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. రెండో విడతగా 8 ఆర్‌బీకేల పరిధిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో యూనిట్ కింద రూ.15 లక్షల విలువ చేసే ట్రాక్టర్, ఇతర అధునిక యంత్రపరికరాలు అందజేస్తామన్నారు. రైతుమిత్ర గ్రూపులుగా ఏర్పడి సహకార బ్యాంకుల్లో ఖాతా తెరవాలన్నారు.

సర్వేను నిర్లక్ష్యం చేయొద్దు

అనంతపురం క్రైం: రీ సర్వే పట్ల నిర్లక్ష్యం చేయవద్దని అదనపు కమిషనర్ రమణారెడ్డి సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం 39వ వార్డు సచివాలయంలో పలు రెవెన్యూ వార్డుల సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. ఇంటి, నీటి పన్ను జాప్యం చేయకూడదన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మొండిబకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, స్పందించని పక్షంలో నగరపాలక సంస్థ అందించే సేవలకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ సుజాత, ఆర్ఐ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా నిలిస్తే అభాండాలా?

- ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



మాట్లాడుతున్న మాల్యవంతం మంజుల

అనంతపురం క్రైం: 'తాడేపల్లిలో మైనర్ బాలిక ఉదంతంపై ప్రభుత్వం తక్షణం స్పందించి నిందితున్ని గంటలోపే అరెస్టు చేసేలా చర్యలు తీసుకుంది. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల సాయం ప్రకటించింది. కుటుంబ కక్షలతో జరిగిన ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించడం తగదు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిస్తే తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు అనిత అభాండాలు వేస్తే ఎలా' అంటూ ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మండిపడ్డారు. బుధవారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనిత అబద్దాలకోరని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం మహిళలకు అత్యంత భద్రత కల్పిస్తున్న విషయం రాష్ట్ర ప్రజానీకానికందరికీ తెలుసన్నారు. గతంలో అతనిపై కేసులు నమోదైతే అప్పటి టీడీపీ నాయకులు అండగా నిలిచారని, కుక్కల రాజును పెంచి పోషించింది గత టీడీపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళితే టీడీపీ నాయకులు కించపరిచేలా మాట్లాడారన్నారు. టీడీపీ చేస్తున్న చౌకబారు రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

'ఎస్ఎస్‌బీఎన్‌లో ఫీజుల దోపిడీ అరికట్టాలి'

అనంతపురం: ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్, నవీన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో పరీక్షకు హాజరు కాకపోయినప్పటికీ విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసూలు చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఎస్ఎస్‌బీఎన్ కళాశాల యాజమాన్యంపై ఎస్కేయూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నరేంద్ర మృతి తీరనిలోటు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీసీ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నరేంద్ర (58) మృతి తీరనిలోటని వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. మంగళవారం నరేంద్ర గుండెపోటుతో మరణించారు. బుధవారం క్యాంపస్‌లోని భువనవిజయంలో సంస్మరణ సభ నిర్వహించారు. నరేంద్ర అంకితభావంతో విధులు నిర్వర్తించారని వీసీ పేర్కొన్నారు. నరేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ వీసీ ప్రొఫెసర్ కాడా రామకృష్ణా రెడ్డి నరేంద్ర మృతి పట్ల ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

రవీంద్రా రెడ్డిని గెలిపిద్దాం



ప్రచారం నిర్వహిస్తున్న విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున ఎమ్మెల్సీ, విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి బుధవారం ప్రచారం నిర్వహించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల, జూనియర్ కళాశాల, నంబర్-1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్లను కలిసి రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొండారెడ్డి, ఓబుల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో స్టేషనరీ కొనుగోలుకు టెండర్లు

అనంతపురం సిటీ: ఐసీడీఎస్ కార్యాలయాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన స్టేషనరీ కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పీడీ కార్యాలయంతో పాటు 10 ప్రాజెక్ట్ కార్యాలయాలు, ఐసీపీఎస్ అనుబంధ విభాగాలతో పాటు 2302 అంగన్‌వాడీ కేంద్రాలకు 2023-24 సంవత్సరానికి సంబంధించి 50 రకాల వస్తువుల కొనుగోలు కోసం రూ.25 లక్షలతో ఇటీవల టెండర్లు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. నిర్ణీత గడువు అనంతరం టెండర్ల బాక్స్‌ను ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో ఇన్‌చార్జ్ పీడీ డాక్టర్ బీఎస్ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ బాబా కాంట్రాక్టర్ల సమక్షంలోనే ఓపెన్ చేశారు. మొత్తం ఏడు సంస్థల టెండర్ దాఖలు చేయగా, అందులో కేజీఎన్ ఎంటర్ ప్రైజెస్ దాఖలు చేసిన టెండర్‌ను తిరస్కరించారు. మిగిలిన ఆరు టెండర్లను ఓకే చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్‌కు నివేదిక సమర్పిస్తామని పీడీ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు టెండర్లు ఖరారు చేస్తామని వెల్లడించారు.

సైనిక కుటుంబాలకు ఆర్థిక సాయం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు ఆంధ్ర-తెలంగాణ సబ్ ఏరియా కేంద్ర కార్యాలయం అధికారులు ఆర్థిక సాయం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఏరియా క్యాంటీన్ మేనేజర్ మారుతీ ప్రసాద్ బుధవారం అందజేశారు. షేక్ మహమ్మద్ సతీమణి రమీజా బేగం(గుత్తి), జాఫర్ హమీద్ భార్య పి.హమీద బాను(అనంతపురం), వాల్మీకి రామయ్య భార్య వాల్మీకి నాగమణి(కొత్తచెరువు)కు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అనంతపురం రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని ఉమెన్స్ పవర్ సొసైటీ అధ్యక్షురాలు సోమసుందరి పేర్కొన్నారు. బుధవారం కక్కలపల్లి సమీపంలో ఉమెన్స్ పవర్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సోమసుందరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. రెండు నెలలు నిర్వహించే కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సునీత, లీలావతి, శిల్పా తదితరులు పాల్గొన్నారు.

రేపు గోరటి వెంకన్న రాక

అనంతపురం కల్చరల్: ప్రముఖ ప్రజాగాయకుడు, కవి గోరేటి వెంకన్న శనివారం నగరానికి రానున్నారు. జానపద గాయకుడు రచించిన 'ఆకలి కేకలు' పాటను ఆయన ఆవిష్కరిస్తారు. ఎస్కేయూ భువన విజయం ఆడిటోరియంలో సాయంత్రం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి గోరటి వెంకన్న విశిష్ట అతిథిగా విచ్చేస్తారని నిర్వాహకులు తెలిపారు. అలాగే రాయలసీమ జానపద పాటలు, నృత్యాలు, కళారూపాల ప్రదర్శన ఉంటుందని కళాభిమానులు విచ్చేయాలని కోరారు.